క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్ల: ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయని నగరానికి చెందిన ప్రముఖ దంత వైద్యుడు సాయితేజరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పామెన వార్డులో ఆదివారం బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు కృష్ణమోహన్ జన్మదినం సందర్భంగా చేవెళ్లకు చెందిన యువ నాయకుడు గుడిపల్లి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 126 మంది వచ్చి దంత సమస్యలపై పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పామెన వార్డు నాయకులు, గ్రామస్తులు, వైద్యులు, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

కరాటే విధిగా నేర్చుకోవాలి

మాస్టర్ సాయినాథ్



బెల్టులు అందుకున్న విద్యార్థులు

షాద్‌నగర్: విద్యార్థులు విధిగా కరాటే నేర్చుకోవాలని మాస్టర్ సాయినాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ థియేటర్ ఆవరణలో యాదవ బూడోఖాన్ కరాటే క్లబ్‌వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో షాద్‌నగర్, శంషాబాద్ బ్రాంచ్‌లకు చెందిన 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాస్టర్లు నరేందర్‌నాయక్, ఉత్తేజ్, గోపి, వినయ్, రాహుల్, శ్రీను, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికావు

షాద్‌నగర్‌రూరల్: దేశం కోసం ప్రాణాలర్పించిన నాయకులను విస్మరించి.. కేవలం ఆర్‌ఎస్‌ఎస్ గురించి గొప్పగా చెప్పడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నేత ఎండీ.ఇబ్రహీం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణత్యాగాలు చేశారని, వారిని స్మరించుకోవడం విస్మరించి ఆర్‌ఎస్‌ఎస్ గురించి గొప్పగా చెప్పడం తగదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఢిల్లీలోని ఎర్రకోటపై చేసిన ప్రసంగంలో దేశంలోని కోట్లాది మంది భారతీయుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడారని, ఇది సరికాదని హితవు పలికారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో బాగ్యరి అంజయ్య మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయంను మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, దశరథ, సత్యం, చైతన్య, మాధవ, సాయి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించండి



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో వివేకానందరెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని ఏబీవీపీ చేవెళ్ల టౌన్ సంయుక్త కార్యదర్శి కేవీ వేకానందరెడ్డి అన్నారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవటంతో విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలపై వెంటనే నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని ఆరోపించారు. దీంతో విద్యార్థుల సమస్యలు ఎక్కువవుతున్నాయన్నారు. విద్యావ్యవస్థ పటిష్ఠతకు, మెరుగైన సౌకర్యాల కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరినట్లు స్పష్టం చేశారు. విద్యారంగాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు. ఆయన సానుకులంగా స్పందించి తప్పకుండా ప్రభుత్వానికి సూచిస్తామని చెప్పారన్నారు.

రోడ్డు పక్కన పాఠశాల!

- కాంపౌండ్ వాల్ లేక భయం భయం
- మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ లేక విద్యార్థుల ఇక్కట్లు
- నిధులున్నా నిర్మాణాలకు అడ్డంకులు
- నాయకుల హామీ నీటిపైన రాతలే?



రోడ్డు సమీపంలో ఆడుకుంటున్న విద్యార్థులు

కేశంపేట: పాఠశాల రోడ్డు పక్కనే ఉండటం.. కాంపౌండ్ వాల్ లేకపోడంతో విద్యార్థులు విరామ సమయంలో రోడ్డుపైకి వెళ్తారని వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయం భయంగా ఉంటున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు టాయిలెట్స్‌కి బయటికి వెళ్తున్నారని, రద్దీగా ఉండే రోడ్డు కావడంతో ఏ క్షణంలో ప్రమాదం సంభవిస్తుందోనని వారు ఆందోళన పడుతున్నారు. ఇది మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల దుస్థితి.

వసతులు లేక అవస్థలు

మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాల కేశంపేట నుంచి జడ్చర్ల వెళ్లే రోడ్డు పక్కనే ఉంటుంది. సుమారుగా 100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో పాఠశాల శిథిలావస్థకు చేరడంతో మన ఊరు– మన బడి పథకంలో పాఠశాలను నూతనంగా నిర్మించారు. పాఠశాల భవనం అన్ని హంగులతో రంగురంగుల బొమ్మలతో చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. కానీ పాఠశాలకు కాంపౌండ్‌వాల్, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ లేక విద్యార్థులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

పాఠశాల పక్కనే రోడ్డు

కేశంపేట నుంచి జడ్చర్ల వెళ్లే రోడ్డు ఎప్పుడు రద్దీగా ఉంటుంది. విద్యార్థులు పాఠశాల విరామ సమయాల్లో టాయిలెట్స్ కోసం రోడ్డుపైకి రావడానికి భయపడుతున్నారు. విద్యార్థులు బయటికి వెళ్లకుండా ఉపాధ్యాయులు రక్షణగా ఉంటున్నారు. పాఠశాల సమయాల్లో మూగజీవాలు, గ్రామస్తులు బహిరంగంగా తిరుతున్నారు. కిచెన్‌షెడ్ లేకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిధులున్నా.. సాగని పనులు

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో పాఠశాలలో కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల, కిచెన్‌షెడ్‌ల నిర్మాణాలకు 26 లక్షల నిధులు ఉన్నాయి. గత నాలుగు సంవత్సరాల కాలంగా నిధులు ఉన్న వాటిని నిర్మించేందుకు ముహూర్తం కలిసి రావడం లేదని గ్రామస్తులు అరోపిస్తున్నారు. కిచెన్‌షెడ్ నిర్మాణం పిల్లర్ల వరకు వచ్చి అగిపోయింది. గ్రామానికి చెందిన నాయకులు పట్టువిడుపులకు పోకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృషిలో ఉంచుకొని త్వరగా పనులను ప్రారంభించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రాజకీయ గ్రహణం

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్, కిచెన్‌షెడ్, మరుగుదొడ్ల నిర్మాణాలకు నాలుగేళ్ల క్రితమే ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.26లక్షలు మంజూరు అయ్యాయి. గ్రామానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు పనులను చేస్తామని తెలుపుతున్నా ముందుకు సాగడం లేదు. అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి చెబుతుండగా.. గ్రామ పంచాయతీ తీర్మాణం ఇస్తే పనులను వెంటనే ప్రారంభిస్తానని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకుడు, మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి అంటున్నారు. కిచెన్‌షెడ్ గది నిర్మించేందుకు పిల్లర్ల వరకు పనులు చేసినట్టు, మిగతా పనులు కూడా పూర్తి చేస్తానని మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు పనులు చేస్తామంటూనే పనులను పెండింగ్‌లో ఉంచారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

భయంగా ఉంటున్నాం



విద్యార్థులు పాఠశాలకు వెళ్లినప్పటి నుంచి ఇంటికి వచ్చేవరకు భయం భయంగా ఉంటున్నాం. పాఠశాల రోడ్డు పక్కనే ఉండటంతో విద్యార్థులు విరామ సమయంలో బయటికి వస్తే ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. అధికారులు, నాయకులు స్పందించి త్వరగా కాంపౌండ్ వాల్, కిచెన్‌షెడ్, మరుగుదొడ్లను నిర్మించాలి.

– అనంగారి లింగం, విద్యార్థి తండ్రి, కేశంపేట

నిధులు ఉన్నాయి

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– నర్సింగ్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ

గౌడల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో యువజన సంఘం నాయకులు

షాద్‌నగర్: గౌడ కులస్తుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆయనను ఆదివారం యువజన సంఘం సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న బహుజన చక్రవర్తి అని, మొట్టమొదటి బహుజన వీరుడన్నారు. నాటి పాలకుల నిరంకుశ పాలనపై యుద్ధం చేసిన యోధుడన్నారు. సర్వాయి పాపన్న చేసిన కృషిని అందరూ గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గౌడలు ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా ఎదిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రానున్న రోజుల్లో గౌడలకు మరిన్ని పథకాలను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు భానుచందర్‌గౌడ్, అభిలాష్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, మధుసూధన్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



షాబాద్: మాట్లాడుతున్న సీఐ కాంతారెడ్డి



మొయినాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

సీఐ కాంతారెడ్డి

షాబాద్: రానున్న వినాయక చవితి ఉత్సవాలను కులమతాలకతీతంగా శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ కాంతారెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉందన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా వ్యవహరించాలన్నారు. మండపాల వద్ద తగిన భద్రతను ఏర్పాటు చేసుకునేలా నిర్వాహకులు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా చేసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో తమకు తెలియని విషయాలను ఇతరులకు పంపొద్దన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ మంచి వారికే వర్తిస్తుందని, చెడువారికి అసలు వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సతీష్‌కుమార్, శంకర్‌రెడ్డి, ఏఎస్ఐ రామ్‌లాల్, పోలీస్ సిబ్బంది, యువజన సంఘాల నాయకులు ఉన్నారు.

అనుమతి తప్పనిసరి

మొయినాబాద్: వినాయక నవరాత్రి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయన నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని.. మండపాల వద్ద సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని.. డీజే సౌండ్ పెట్టొద్దని సూచించారు. ఉత్సవాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐలు వెంకన్న, సుభాష్, వివిధ గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడలో మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మధుసూదన్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, లింగం, నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గంప జాతర

చేవెళ్ల: పట్టణంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాసంలో నిర్వహించే గంప జాతర సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకుడు దేవునివామనచార్యులు తెలిపారు. చేవెళ్లలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాసంలో వచ్చే చివరి సోమవారం గంప జాతర కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. భక్తులు ఉదయం ఆలయానికి వచ్చి రోజంతా ఆలయంలోనే దైవ సన్నిధిలో ఉంటూ వంటావార్పులతో ఆలయ పూజల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వర కు ప్రత్యేక పూజలు కొనసాగుతాయని, సాయ ంత్రం గరుడవాహన సేవ ఉత్సవం ఉంటుందని తెలిపారు. మండలంలోని గ్రామాల్లోని ప్రజలతో పాటు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఉట్ల పండుగ



శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని అమ్డాపూర్‌లో ఉట్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని వీధుల గుండా ఊరేగించి.. హనుమాన్ దేవాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి, సుందరపురం, కొనాయపల్లి, అల్వాల, లేమామిడి, వేములనర్వ గ్రామాల్లో కోట మైసమ్మ, ఈదమ్మ, పెద్దమ్మతల్లి, బీరప్ప బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా మల్లన్న బోనాలు

షాబాద్: మండల పరిధిలోని ముద్దెంగూడలో మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడిగా మారింది.



కేశంపేట: కొనాయపల్లిలో బోనాల ఊరేగింపు



షాబాద్: ముద్దెంగూడలో..

సన్మానం



రెడ్యానాయక్‌ను సన్మానిస్తున్న భీమ్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: యువత సేవాదృక్పదంతో ముందుకు సాగాలని రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ శాఖ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. లయన్ మానుకోటబేరా సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ రెడ్యానాయక్ ఎన్నికయ్యారు. ఆదివారం పట్టణంలోని భవాని కంటి ఆస్పత్రిలో చైర్మన్ భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి డాక్టర్ రెడ్యానాయక్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీమ్‌రెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. సేవా భావాన్ని అలవర్చుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. డాక్టర్ రెడ్యానాయక్ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం రెడ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రజాసేవే పరమావధిగా ప్రజలకు ఉచిత వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ వెంకన్నబాబు, కార్డియాలజిస్టు డాక్టర్ చందూలాల్‌రాథోడ్, బీజేపీ నేత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

ఆమనగల్లు: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి పేర్కొన్నారు. తలకొండపల్లి మండలం లింగరావ్‌పల్లి గ్రామానికి చెందిన మట్టరాజు ఇటీవల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొంది ఆర్థికసాయం కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయనిధి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.40వేల చెక్కును ఆదివారం లింగరావ్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మట్ట రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకురు ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నదీమ్‌నగర్‌లో వెలుగుతున్న విద్యుత్ దీపం



బాకారంలో వెలుగుతున్న విద్యుత్ దీపం

పట్టపగలు వెలుగులు

మొయినాబాద్‌రూరల్: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని.. ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతూనే ఉంది. రాత్రి సమయాల్లో గ్రామాల్లో వెలుతురు కోసం ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో పాటు కొన్నింటికి స్విచ్‌లు ఉన్నా బంద్ చేయకపోవడంతో కరెంటు ఉన్నంతసేపు వెలుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని నదీమ్‌నగర్, బాకారం గ్రామాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధిదీపాలు ఎప్పుడూ వెలుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విద్యుత్ దీపాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వర్షంలో తడవాల్సిందేనా?

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు
- ఎండ, వానలో గంటల తరబడి రోడ్లపైనే నిరీక్షణ
- పట్టించుకోని సంబంధిత అధికారులు



అమ్డాపూర్ చౌరస్తాలో బస్‌షెల్టర్ లేక వర్షంలో రోడ్డుపైనే బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మొయినాబాద్: బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు షెల్టర్లు కరువయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని బస్‌స్టాపుల్లో ఎక్కడా షెల్టర్లు లేవు. దీంతో ఎండలో, వానలోనూ ప్రయాణికులు రోడ్లపైనే నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

నిత్యం వేలమంది రాకపోకలు

పట్టణ కేంద్రంగా విస్తరిస్తున్న మొయినాబాద్ ప్రాంతంలో ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులు తప్పడంలేదు. మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట చౌరస్తా, అజీజ్‌నగర్ చౌరస్తా, హిమాయత్‌నగర్ చౌరస్తా, అమ్డాపూర్ చౌరస్తాతో పాటు మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో బస్‌స్టాపులు ఉన్నాయి. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి మొయినాబాద్ మీదుగా ఉండటంతో ఈ రోడ్డుపై ఆర్టీసీ బస్సులు చాలానే తిరుగుతాయి. మున్సిపాలిటీ పరిధిలో ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలతో పాటు ఇతర విద్యాసంస్థలు ఉండటంతో నిత్యం వేలసంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు మొయినాబాద్‌లోని విద్యాసంస్థలకు వస్తుంటారు. దీనికి తోడు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేవారు వేల సంఖ్యలోనే ఉంటారు. అధిక శాతం మంది ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్తారు. వారంతా బస్సుల కోసం నిరీక్షించేందుకు షెల్టర్లు లేవు. ఎండ ఉన్నా, వర్షం పడినా రోడ్లపైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కేంద్రంలో సైతం బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికుల పాట్లు

ప్రతిరోజు వేల సంఖ్యలో ప్రయాణికులు బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. బస్‌స్టాపుల్లో బస్ షెల్టర్ల ఏర్పాటుపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేదని ప్రయాణికులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నారు.